సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 5 । మార్చి । 2024



భద్రతా చర్యలు పాటించాలి
బీటీపీఎస్, కేటీపీఎస్‌లో భద్రతా చర్యలు పాటిస్తూ విద్యుత్ ఉత్పత్తి చేయాలని ఎస్‌ఈలు జెన్కో ప్రభాకర్‌రావు సూచించారు. 8లో



సీసీ నిఘాలో అంగన్‌వాడీలు..
అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు పారదర్శకత పెరగనుంది. 8లో

గరిష్టం / కనిష్టం 36° / 21°
వాతావరణం
జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు గంటగంటకూ పెరుగుతాయి. రాత్రివేళ వాతావరణం మాత్రం చల్లగా మారుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

8న పెద్దమ్మతల్లి ఆలయంలో రుద్రహోమం

పాల్వంచరూరల్ : మహా శివరాత్రి సందర్భంగా ఈనెల 8న పెద్దమ్మతల్లి ఆలయంలో రుద్ర హోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు యాగశాలలో హోమం జరుగుతుందని, పాల్గొనదలచిన భక్తులు రూ.1,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9866923261, 6303408458 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ 'దసరా' విజేతల ఎంపిక

ఖమ్మం మామిళ్లగూడెం: దసరా పండుగ సందర్భంగా గత ఏడాది అక్టోబర్ 18నుండి 30వ తేదీ వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన వారి నుంచి విజేతలను సోమవారం ఎంపిక చేశారు. అప్పట్లో బస్సుల్లో ప్రయాణించిన వారు డిపోల్లో ఏర్పాటుచేసిన బాక్సుల్లో టికెట్లు వేయగా, వాటిని ఖమ్మం కొత్త బస్టాండ్‌కు తీసుకొచ్చి రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న ప్రయాణికులతో డ్రా తీయించారు. విజేతలుగా టి.మణి(సత్తుపల్లి), పి.సింధు, బి.సమ్మక్క(భద్రాచలం), రాజరాజేశ్వరి(నర్సంపేట), సీహెచ్.నాగమణి(మహబూబాబాద్) నిలవగా మరో ఐదుగురు పురుషులు కూడా ఎంపికయ్యారు. వీరికి బహుమతులు అందించే తేదీని త్వరలో ప్రకటిస్తామని ఆర్ఎం తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం పవిత్ర, ఖమ్మం డీఎం బి.శ్రీనివాస్, సీఐలు రామయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

11న జేఎల్ఎంల ఎంపిక పరీక్ష

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్థాయి జూనియర్ లైన్‌మెన్ల(జేఎల్ఎం) ఎంపిక పరీక్ష ఈ నెల 11న ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ ఏ.సురేందర్ తెలిపారు. అర్హులైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనతో పాటు స్తంభం ఎక్కే పరీక్ష ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. ఇప్పటికే అభ్యర్థులకు పోస్టు ద్వారా సమాచారం ఇవ్వడమే కాక, జాబితాను సర్కిల్ కార్యాలయం నోటీసు బోర్డుపై ప్రదర్శించామని తెలిపారు.

మెడికల్ షాపుల్లో ఫార్మసిస్ట్ తప్పనిసరి



మెడికల్ షాపులో రికార్డులు పరిశీలిస్తున్న డీఐ సంపత్

బూర్గంపాడు: మెడికల్ షాపుల్లో ఫార్మసిస్ట్ తప్పనిసరిగా ఉండాలని, లేదంటే చర్యలు తప్పవని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సంపత్ హెచ్చరించారు. సారపాకలోని మందుల దుకాణాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డ్రగ్స్ యాక్ట్ నిబంధనల మేరకే మందులు విక్రయించాలని సూచించారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని, మత్తుమాత్రలు విక్రయించే ముందు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పది షాపులకు నోటీసులు జారీ చేశారు.

'ధరణి' దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీఓ

అశ్వారావుపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను కొత్తగూడెం ఆర్డీఓ డి. మధు సోమవారం పరిశీలించారు. వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి తగు సూచనలు చేశారు.

చేరిక లాంఛనమేనా ?!

కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు వెంకట్రావ్ రంగం సిద్ధం
- 11న భద్రాచలంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనలో ముహూర్తం
- బీఆర్ఎస్ అధినాయకత్వానికి దూరంగా ఎమ్మెల్యే
- ఇన్‌చార్జ్ పదవి కోసం హరీశ్‌రావును కలిసిన స్థానిక నాయకులు !



గత ఎన్నికల ముందు కేసీఆర్ నుంచి బీ ఫాం అందుకుంటున్న వెంకట్రావ్ (ఫైల్)

భద్రాచలం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ తరఫున భద్రాచలం నుంచి గెలుపొందిన ఏకైక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. తాజా పరిణామాలన్నీ దీనికి ఊతమిస్తున్నాయి. మరోవైపు అప్పుడే బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవి కోసం హైదరాబాద్‌లో తీవ్రస్థాయిలో లాబీయింగ్ జరుగుతుండడం గమనార్హం.

పార్లమెంటరీ సమావేశానికి డుమ్మా..
మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి తెల్లం వెంకట్రావు కుటుంబసమేతంగా ఆదివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఇక సోమవారం బీఆర్ఎస్ అధినాయకత్వం హైదరాబాద్‌లోనే మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించింది. భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా వెంకట్రావ్ ఈ సమావేశంలో పాల్గొనాల్సి ఉండగా, డుమ్మా కొట్టారు. అంతేకాక అధినాయకత్వానికి ఫోన్‌లో సైతం అందుబాటులో లేరని తెలుస్తోంది. 'మేం హైదరాబాద్ వస్తున్నాం.. అక్కడే ఉండండి.. ముఖ్య నాయకులతో చర్చిద్దాం' అని స్థానిక బీఆర్ఎస్ నాయకులు కొందరు చెప్పినా ఎమ్మెల్యే పెద్దగా స్పందించలేదని సమాచారం. తన ఆర్థిక పరిస్థితి బాగోలేదని, పరిస్థితి చేజారిపోయిందని ఆయన కొందరి వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. బీఆర్ఎస్ నాయకుల మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శనకు కూడా వెంకట్రావ్ గైర్హాజరయ్యారు. ఇక ఈనెల 11న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాచలం పర్యటన ఖరారు కావడంతో అదేరోజు ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరికకు ముహూర్తం కుదుర్చుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

రెండోసారి కాంగ్రెస్‌లోకి..
అత్యంత సౌమ్యుడిగా, భద్రాచలం ఏజెన్సీలో పేదల పాలిట మంచి వైద్యుడిగా పేరొందిన తెల్లం వెంకట్రావ్ రాజకీయ ప్రస్థానం అనేక మలుపులు తిరుగుతూ వస్తోంది. ఎంఎస్ పూర్తిచేసి వైద్యుడిగా సేవలందిస్తున్న ఆయన తొలిసారి వైఎస్సార్‌సీపీ ద్వారా రాజకీయ ఆరంగేట్రం చేశారు. 2014లో ఆ పార్టీ తరఫున మహబూబాబాద్ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి బీఆర్ఎస్‌లో చేరి 2018లో భద్రాచలం ఎమ్మెల్యేగా పోటీ చేసి మళ్లీ ఓటమి చెందారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలతో గతేడాది పొంగులేటితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. అయితే భద్రాచలంలో సిట్టింగ్ ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఉండడంతో కాంగ్రెస్ టికెట్ దక్కే అవకాశం లేకపోవడంతో తన చిరకాల ఎమ్మెల్యే వాంఛ తీర్చుకునేందుకు పొంగులేటిని సైతం కాదని బీఆర్ఎస్‌లో చేరి బీ ఫాం తెచ్చుకున్నారు. ఎట్టకేలకు ఎమ్మెల్యేగా ఎన్నికైనా.. ఉమ్మడి జిల్లాలో ఆయన ఒక్కరే గెలుపొందడం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కంగుతిన్నారు. పైగా తన రాజకీయ గురువు పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంత్రిగా కొనసాగుతుండడం, ఆయన అనుచరుడిగా ముద్రపడిన వెంకట్రావ్ బీఆర్ఎస్‌లో ఇమడలేని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు ఎన్నికల ముందు చేసిన ఆర్థిక లావాదేవీలు సైతం ఇబ్బంది పెడుతుండడంతో ఐదు నెలలలోపే మళ్లీ రెండోసారి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.

వెళ్లేదెవరు.. ఉండేదెవరు.. ?
ఎమ్మెల్యే వెంకట్రావ్ కాంగ్రెస్‌లో చేరితే ఆయన వెంట వెళ్లెదెవరు.. బీఆర్ఎస్‌లో ఉండేదెవరనే చర్చ నడుస్తోంది. ఇప్పటికే పలువురు నాయకులు ఎమ్మెల్యే వెంట నడిచేందుకు మొగ్గు చూపుతుండగా, బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఎవరనేది తేలితే మరికొందరు కూడా కాంగ్రెస్ గూటికి చేరే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. కాగా, కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన పొదెం వీరయ్య ప్రస్తుతం డీసీసీ అధ్యక్షుడిగా ఉండడంతో ఒక ఒరలో రెండు కత్తులు ఇముడుతాయా అని పలువురు అంటున్నారు.

ఇన్‌చార్జ్ పదవి కోసం పలువురి ప్రయత్నాలు..
ఎమ్మెల్యే వెంకట్రావ్ కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారంతో భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ పదవి కోసం పలువురు నాయకులు లాబీయింగ్ మొదలుపెట్టారు. గతంలో ఇన్‌చార్జ్‌గా పనిచేసిన మానె రామకృష్ణ సోమవారం స్థానిక నాయకులతో కలిసి మాజీ మంత్రి హరీశ్‌రావును కలిశారు. పార్టీలో తన సీనియారిటీని వివరించి, ఎమ్మెల్యే పార్టీ మారితే తననే ఇన్‌చార్జ్‌గా నియమించాలని కోరారు. చర్ల మార్కెట్ మాజీ చైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య సైతం పలువురి ద్వారా ప్రయత్నం చేస్తున్నారు. ఇక సీపీఐలో కీలక పదవులు చేపట్టి ఎన్నికల ముందు బీఆర్ఎస్‌లో చేరిన రావులపల్లి రాంప్రసాద్ పేరు కూడా వినిపిస్తోంది. ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అతడికి సమీప బంధువు కావడం కలిసొచ్చే అంశంగా పలువురు భావిస్తున్నారు.

11న భద్రాద్రికి రేవంత్‌రెడ్డి

- బూర్గంపాడు మండలంలో సభ ?



లక్ష్మీపురంలో సీఎం సభకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయం, నాయకులు

భద్రాచలం/బూర్గంపాడు : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 11న భద్రాచలం రానున్నారు. ఈ మేరకు అధికారులు సోమవారం షెడ్యూల్ విడుదల చేశారు. భద్రాచలంలో శ్రీసీతారామచంద్ర స్వామి వారి దర్శనం అనంతరం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. ఆ తర్వాత బహిరంగసభ ఉంటుందని ప్రకటించినా.. వేదిక ఎక్కడ, ఎన్ని గంటలకు అనేది స్పష్టం చేయలేదు. భద్రాచలం తర్వాత సీఎం బూర్గంపాడు మండలంలో జరిగే సభలో మాట్లాడుతారని సమాచారం. ఈ క్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్యతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు లక్ష్మీపురం, బూర్గంపాడు, మోరంపల్లిబంజరలో సభకు అనువైన స్థలాలను పరిశీలించారు.

పోలియో రహిత సమాజానికి కృషిచేయాలి

డీఎంహెచ్ఓ శిరీష



ఆదివాసీ పిల్లలతో డీఎంహెచ్ఓ శిరీష తదితరులు

చండ్రుగొండ/అన్నపురెడ్డిపల్లి : పోలియో రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జేవీఎల్ శిరీష అన్నారు. జిల్లాలో పోలియో చుక్కలు వేసే కార్యక్రమం చక్కగా నడుస్తోందని చెప్పారు. చండ్రుగొండ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో ట్రాన్సిట్ పాయింట్‌ను, పీహెచ్‌సీలో రికార్డులను సోమవారం ఆమె పరిశీలించారు. అనంతరం మద్దుకూరు పల్లెదవాఖానాలో రికార్డులు తనిఖీ చేశారు. బెండాలపాడు శివారు ఎర్రబోడు, మద్దుకూరు శివారు మంగళిబోడు గ్రామాల్లో గొత్తికోయ ఆదివాసీలతో మాట్లాడి వైద్యసేవలు సక్రమంగా అందుతున్నాయా అని ఆరా తీశారు. పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. అనంతరం అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించారు. వైద్యసేవలపై ఆరా తీసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆదివారం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పోలియో చుక్కలు వేయించని వారి ఇళ్లకు వెళ్లి చుక్కల మందు వేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ విధిగా చుక్కల మందు వేయాలన్నారు. కార్యక్రమంలో చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి వైద్యాధికారులు కనకం తనుజ, ప్రియాంక, సిబ్బంది ఎండీ ఇమాం, శోభ, లక్ష్మి, ఆశ వర్కర్లు రమణమ్మ, పుణ్యవతి, ఎర్రగుంట పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక, హెచ్ఈఓ కృష్ణయ్య, ఏఎన్ఎం సుశీల పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబూరావు

కరకగూడెం: సస్యరక్షణ చర్యలతో వరిలో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబూరావు తెలిపారు. సోమవారం కరకగూడెం, పినపాక మండలాల్లోని పామ్ ఆయిల్, మిర్చి, వరి క్షేత్రాలు సందర్శించి మాట్లాడారు. ప్రస్తుతం వరి పంటను కాండం తొలుచు పురుగు ఆశిస్తోందని, దీని నివారణకు కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 50 శాతం ఒక గ్రాము నీటికి కలిపి పిచికారీ చేయాలని లేదా కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఎకరానికి 10 కేజీల చొప్పున వేసుకోవాలి సూచించారు. కొత్తగా పోడు పట్టాలు పొందిన రైతులు పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు చటర్జీ, అనిల్, ప్రశాంత్, కేశవరావు, లక్ష్మణ రావు, వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ సమ్మయ్య, రైతులు పాల్గొన్నారు.

ఉద్యాన క్షేత్రాల పరిశీలన



పామాయిల్ తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు

దమ్మపేట: దమ్మపేట, అశ్వారావుపేట మండలాల పరిధిలోని ఉద్యాన క్షేత్రాలను కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ కిరణ్‌కుమార్ శాస్త్రవేత్తలతో కలసి సోమవారం సందర్శించారు. దమ్మపేట మండలం మందలపల్లి, అల్లిపల్లి, అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాల, నారంవారిగూడెం, గుర్రాలచెరువు గ్రామాల్లో మామిడి, పామాయిల్, కొబ్బరి, కోకో, జాజికాయ, అరటి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో మహబూబాబాద్ ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ కె.భాస్కర్, అశ్వారావుపేట హెచ్ఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ విజయకృష్ణ, రైతు నాయకులు ఆలపాటి రామచంద్రప్రసాద్, బండి భాస్కర్, కె.వి.సత్యనారాయణ, ఎర్రా వసంతరావు పాల్గొన్నారు.

కేటీపీఎస్‌ను సందర్శించిన జెన్‌కో విజిలెన్స్ ఎస్పీ



కేటీపీఎస్‌లో విజిలెన్స్ ఎస్పీ ప్రతాప్

పాల్వంచ : నూతనంగా బాధ్యతలు చేపట్టిన జెన్‌కో విజిలెన్స్ ఎస్పీ డి.ప్రతాప్ సోమవారం కేటీపీఎస్ కాంప్లెక్స్‌ను సందర్శించారు. ఓఅండ్ఎం, 5, 6, 7 దశలు, యాష్‌పాండ్ తదితర ఏరియాల్లో పర్యటించి కర్మాగారంలో తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సీఈలు ఎం.ప్రభాకర్ రావు, పి.వెంకటేశ్వరరావుతో మాట్లాడారు. ఆ తర్వాత రక్షణ వారోత్సవాల్లో పాల్గొని కర్మాగార నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

కలెక్టర్‌ను కలిసిన పలువురు అధికారులు



బదిలీపై వెళ్తున్న రాంబాబును సత్కరిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): బదిలీపై జిల్లాకు వచ్చి బాధ్యతలు చేపట్టిన అధికారులు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలు అందజేశారు. ఆర్టీఓ వెంకటరమణ, జిల్లా ఉద్యాన శాఖాధికారి సూర్యనారాయణ, భద్రాచలం ఆర్డీఓ కె దామోదర్‌రావు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాధాన్యతల మేరకు సమష్టిగా విధులు నిర్వహించాలని, జిల్లా ప్రజలకు సేవలు అందించాలని సూచించారు.

విధుల నుంచి రిలీవ్..
జిల్లాలో అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహించి జగిత్యాలకు బదిలీపై వెళ్తున్న పర్సా రాంబాబును కలెక్టర్ సోమవారం విధుల నుంచి రిలీవ్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్ఓ రవీంద్రనాథ్, ఏఓ గన్యా పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో సబ్ పోస్టాఫీస్ ప్రారంభం..
కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సబ్ పోస్టాఫీస్‌ను కలెక్టర్ ప్రియాంక ఆల సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తపాలా సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. బీమా పాలసీల్లో సభ్యులుగా చేరి భవిష్యత్‌కు భద్రత ఏర్పర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఖమ్మం పోస్టల్ సూపరింటెండెంట్ బి.రవికుమార్, కొత్తగూడెం అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ రంజిత్ కుమార్ చౌదరి, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌నాయక్, పోస్ట్‌మాస్టర్ ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతిని సద్వినియోగం చేసుకోండి

ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్



జీరోబిల్లు అందజేస్తున్న పీఓ ప్రతీక్ జైన్, విద్యుత్ అధికారులు

భద్రాచలంఅర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం ఆయన భద్రాచలంలో అర్హులైన వారికి జీరో బిల్లులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇళ్లలో 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించుకునే తెల్ల రేషన్‌కార్డుదారులకు ఈ పథకం వర్తిస్తుందని, ప్రతీ ఒక్కరు అవసరాన్ని బట్టి విద్యుత్‌ను వినియోగించుకోవాలని సూచించారు. విద్యుత్ మీటర్లలో ఏమైనా సమస్యలుంటే సంబంధిత అధికారులకు సమాచారం అందిస్తే వారు పరిష్కరిస్తారని చెప్పారు. విద్యుత్‌ను వృథా చేయకుంటే ట్రాన్స్‌ఫార్మర్లపై కూడా అధిక భారం పడదని, తద్వారా ఆటంకం లేకుండా సరఫరా జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఏపీఓ (పవర్) మునీర్ పాషా, విద్యుత్ శాఖ ఏడీఈ వేణు, ఏఈ రాజారావు, ఎల్ఐ సర్వేశ్వర్‌రావు, లైన్‌మెన్ త్రినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి
భద్రాచలంటౌన్: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకుని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పీఓ ప్రతీక్‌జైన్ అన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఎస్‌హెచ్‌జీ మహిళలు జీసీసీ ద్వారా తయారుచేసిన వివిధ వస్తువులను సోమవారం ఆయన పరిశీలించి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలంతా గ్రూప్‌గా ఉండి ప్రభుత్వం అందించే సబ్సిడీ రుణాలతో జీవనోపాధి కల్పించుకోవాలని సూచించారు. చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటుతో సబ్బులు, నూనెలు, గృహావసరాల సరుకులు తయారు చేసి సరసమైన ధరలకు విక్రయిస్తూ ఉపాధి పొందడం సంతోషంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య కూడా స్టాల్‌ను సందర్శించి మహిళలు తయారుచేసిన వస్తువులను కొనుగోలు చేశారు.

పది పరీక్షలకు సన్నద్ధం చేయాలి
పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను సన్నద్ధం చేయాలని పీఓ ప్రతీక్‌జైన్ అన్నారు. విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించి వారు ఎలా రాస్తున్నారో పరిశీలించాలని సబ్జెక్ట్ టీచర్లు, ప్రత్యేకాధికారులకు సూచించారు. స్థానిక ఐటీడీఏ సమావేశంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. వచ్చిన ప్రతీ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. వాటిని పరిశీలించి తన పరిధిలోని వాటిని పరిష్కరిస్తామని, మిగిలినవి సంబంధిత అధికారులకు పంపిస్తామని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

నామాకే మళ్లీ!

- ఖమ్మం పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ప్రకటన
- జిల్లా నేతల భేటీలో వెల్లడించిన కేసీఆర్



నామా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మరోసారి ఎంపీ నామా నాగేశ్వరరావు పేరునే పార్టీ అధినేత కేసీఆర్ ఖరారు చేశారు. హైదరాబాద్‌లో సోమవారం పార్టీ జిల్లా నేతలతో జరిగిన సమావేశంలో కేసీఆర్ ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ఖమ్మం నుంచి నామా నాగేశ్వరరావు ఎంపీగా రెండు సార్లు గెలిచారు. ప్రస్తుతం సిట్టింగ్ ఎంపీగా ఉన్న ఆయననే మరోమారు అభ్యర్థిగా ప్రకటించారు.

2009లో తొలిసారి..
2004 నుంచి రాజకీయాల్లో కొనసాగుతున్న నామా నాగేశ్వరరావు 2009 ఎన్నికల్లో తొలిసారి టీడీపీ నుండి ఎంపీగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి రేణుకాచౌదరిపై విజయం సాధించారు. ఆ తర్వాత 2014లోనూ టీడీపీ నుంచే పోటీ చేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరి ఆ పార్టీ నుంచే 2019 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. దీంతో ఆయనను బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేతగా ఎన్నుకున్నారు. కాగా, ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా నామానే మరోమారు ప్రకటించడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ మేరకు నియోజకవర్గ పరిధిలోని పలుచోట్ల సోమవారం సంబురాలు జరుపుకున్నాయి.

స్వస్థలం బలపాల..
మహబూబాబాద్ జిల్లా బలపాలలో నామా ముత్తయ్య - వరలక్ష్మి దంపతులకు 1957 మార్చి 15న నాగేశ్వరరావు జన్మించారు. ఆయనకు భార్య చిన్నమ్మతో పాటు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. పారిశ్రామిక వేత్తగా కొనసాగుతున్న నామా ఇప్పటికే రెండుసార్లు ఖమ్మం నుంచి ఎంపీగా గెలిచారు.

విప్లవ పార్టీల కలయికతో బలమైన ఉద్యమాలు

- తొలిరోజు 'యూనిటీ' మహాసభల్లో వక్తలు
- హాజరైన దేశ, విదేశీ ప్రతినిధులు



అరుణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సుభాష్ దేవ్, పక్కన పోటు రంగారావు తదితరులు



అమరులకు నివాళులర్పిస్తున్న జర్మనీ ప్రతినిధులు

ఖమ్మంమయూరిసెంటర్: ఫాసిజం పెరిగిన నేపథ్యాన, అన్ని దేశాల్లో సామ్రాజ్యవాదులు ప్రభుత్వాలను తమ చెప్పుచేతుల్లో పెట్టుకుంటున్నందున బలమైన ఉద్యమాల నిర్మాణానికి విప్లవ పార్టీల కలయిక అవసరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సీపీఐ(ఎంఎల్) ఆర్ఐ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, పీసీసీ సీపీఐ(ఎంఎల్) పార్టీల విలీనం సందర్భంగా సోమవారం ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో యూనిటీ మహాసభలు ప్రారంభమయ్యాయి. ప్రాంగణంలో అరుణ పతాకాన్ని సుభాష్ దేవ్ ఆవిష్కరించగా, మాస్‌లైన్ నాయకులు ప్రదీప్ ఠాగూర్, సుభాష్‌దేవ్, పోటు రంగారావు అధ్యక్షవర్గంగా నిర్వహించిన సభలో రెండు నిమిషాల పాటు మౌనం పాటించి అమరులకు నివాళులర్పించారు. ఆతర్వాత యూనిటీ మహాసభ ఆహ్వాన సంఘం చైర్మన్ వడ్డెల్లి కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మూడు విప్లవ పార్టీల కలయిక అభినందనీయమని చెబుతూ, పార్టీల విలీనానికి కారణాలను వివరించారు. అనంతరం జర్మనీ ప్రతినిధి సుష మాట్లాడుతూ భారత్‌లో మారుతున్న పరిస్థితులను విశ్లేషిస్తూ మాస్‌లైన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. నేపాల్ కమ్యూనిస్టు పార్టీ(మషాల్) కేంద్ర నాయకుడు టాక్కర్ కనాల్ మాట్లాడుతూ నిరంకుశ రాజ్యాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీలు ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఆతర్వాత శ్రీలంక, మొరాకో దేశాలతో పాటు తమిళనాడుకు చెందిన యూనిటీ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు మురుగేషన్ పరస్రామన్, సీపీఐ(ఎంఎల్) రెడ్ ఫ్లాగ్ నాయకులు పంపిన సందేశాలను సంజయ్ సింఘ్వీ వినిపించారు. అలాగే, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారులు పాడిన పాటలే కాక జర్మనీ దేశ ప్రతినిధి సుష పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. ఈ సభలో దేవతాశర్మ, కె.రమ, కే.జీ.రామచందర్, రిషి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రిటైర్డ్ హెచ్‌ఎంకు బంగారు నంది అవార్డు

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం డాక్టర్ మద్దిశెట్టి వెంకటేశ్వర రావు మరో బంగారు నంది అవార్డు అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్ బీఎం బిర్లా సైన్స్ మ్యూజియంలో మెగా ఎంటర్‌ప్రైజెస్ గోల్డెన్ అచీవ్‌మెంట్ అవార్డుల ప్రదానోత్సవం జరగ్గా, రాష్ట్ర మంత్రి కోమటరెడ్డి వెంకటరెడ్డి, సినీ నటులు హాజరయ్యారు. విద్యారంగంలో విశేష సేవలు అందించిన వెంకటేశ్వరరావుకు బంగారు నంది అవార్డు, మెమెంటోను అందజేశారు. ఈ మేరకు సోమవారం అవార్డు గ్రహీత వివరాలు వెల్లడించారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పెదవాగు ప్రాజెక్టు గ్రామంలో ఉన్న తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.రోజా తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. గురుకుల సెట్ కామన్ ఎంట్రన్స్ పరీక్షకు ఈ నెల 2వ తేదీ నుంచి ఏప్రిల్ 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ 28న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని, ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివే గిరిజన బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కడివెండికి సేవారత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న విశ్వనాథ గుప్తా

మణుగూరు టౌన్: మణుగూరుకు చెందిన సంఘ సేవకులు, వాసవీక్లబ్ సభ్యులు కడివెండి విశ్వనాథ గుప్తాకు సేవా రత్న నేషనల్ అవార్డు–2024ను బహుజన సాహిత్య అకాడమి జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అందజేశారు. ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో అవార్డు ప్రదానం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్, మాజీ ఎంపీ సుగుణ కుమారి, కొత్తగూడెం కార్పొరేట్ ఆఫీస్ జీఎం లలిత్‌కుమార్, పి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాత మెడికల్ బోర్డునే కొనసాగించాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో కొత్త మెడికల్ బోర్డు విధివిధానాలు సక్రమంగా లేనందున పాత బోర్డ్‌నే కొనసాగించాలని హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. హయ్యర్ రిఫరల్ పేరుతో ఆస్పత్రి అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులను ఏరియాల ఆస్పత్రుల వైద్యులు సింగరేణి ప్రధానాస్పత్రిలో జరిగే మెడికల్ బోర్డుకు పంపిస్తే దృష్టి, వినికిడి లోపం ఉన్నవారిని అన్‌ఫిట్ చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. అయితే, తప్పుడు మార్గాల్లో వచ్చే వారిని మాత్రం అన్‌ఫిట్ చేస్తున్నారని, ఇందులో కొందరు వైద్యులు, సిబ్బంది పాత్ర ఉందని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన మెడికల్ బోర్డ్‌లో రూ.లక్షలు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నందున ఈనెల 5, 6వ తేదీల్లో జరిగే బోర్డ్ అయినా సక్రమంగా నిర్వహించాలని రియాజ్ కోరారు. బోర్డ్ పారదర్శకంగా జరిగేలా ఏసీబీకి అప్పగించినా, ఇప్పటివరకు వివరాలు ఆరా తీయకపోవటం గర్హనీయమన్నారు.

రేషన్ బియ్యం సీజ్

పాల్వంచరూరల్: మండల పరిధిలోని నాగారం గ్రామంలో గోద మహేష్ ఇంట్లో నిల్వ ఉంచిన 6.50 క్వింటాళ్లు, చెవుగాని తిర్మల్‌రావు ఇంట్లో నిల్వ చేసిన 6.50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం పోలీసులు సీజ్ చేశారు. బియ్యాన్ని అక్రమంగా నిల్వచేసిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ బి.శ్రీనివాస్ తెలిపారు.

పురుగుమందు తాగి ఆత్మహత్య

టేకులపల్లి: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి సోమవారం మృతి చెందాడు. మండలంలోని చింతల్లంక గ్రామానికి చెందిన గుమ్మడి వెంకన్న (55) తన మిర్చి తోటలో సోమవారం పురుగుల మందు తాగాడు. ఆలస్యంగా గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిరప పంటలో నష్టం రావడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

యువతి, యువకుడు ఆత్మహత్యాయత్నం

పాల్వంచ: పట్టణానికి ఓ యువతి, ఓ యువకుడు సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. వికలాంగుల కాలనీకి చెందిన యువతి దీప్తి ఆదివారం టాబ్లెట్లు మింగి ఆత్మహత్యకు యత్నించింది. ఆమెకు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించి, పరిస్థితి మెరుగ్గానే ఉండటంతో ఇంటికి తీసుకెళ్లారు. సోమవారం అదే కాలనీకి చెందిన యువకుడు రామకృష్ణ గడ్డి మందు తాగి అపస్మారక స్థితికి చేరడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా దీప్తి కూడా చేతిని మణికట్టు వద్ద కోసుకోవడంతో రక్తస్రావం అవడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈవిషయమై ఎస్‌ఐ బి.రాముని వివరణ కోరగా.. తమకు ఫిర్యాదు రాలేదని తెలిపారు.

అధికారుల నిలదీత

రసాభాసగా మారిన పీసా గ్రామసభ

- సింగరేణి దత్తత గ్రామాన్ని పట్టించుకోవడంలేదని ఆగ్రహం
- ఓసీకి భూములివ్వబోమని తేల్చిచెప్పిన గ్రామస్తులు



సంతకాలు పెట్టకుండా వెనుదిరుగుతున్న గ్రామస్తులు

మణుగూరు టౌన్: మణుగూరు ఓపెన్‌కాస్ట్ విస్తరణ నేపథ్యంలో రామానుజవరంలో నిర్వహించిన పీసా గ్రామసభ రసాభాసగా మారింది. సింగరేణి యాజమాన్యం దత్తత తీసుకున్న గ్రామంలో సమస్యలు పరిష్కరించడం లేదని అధికారులను నిలదీశారు. ఓసీకి భూములు ఇచ్చేదిలేదంటూ తేల్చి చెప్పారు. ఓపెన్‌కాస్టు విస్తరణకు మణుగూరు, రామానుజవరం, తిర్లాపురం గ్రామాల పరిధిలో సుమారు 813 ఎకరాల భూమి సేకరించనున్నారు. ఇందుకోసం తహసీల్దార్, ప్రత్యేకాధికారి రాఘవ రెడ్డి అధ్యక్షతన సోమవారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. తొలుత స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టి.సుమ మాట్లాడారు. 2013 చట్టం ప్రకారం భూములు కోల్పోయే తిర్లాపురం, రామానుజవరం గ్రామ నిర్వాసితులకు కలిగే ప్రయోజనాలను, ఈ ప్రాంత వాసులకు కలిగే ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి వివరాలు వెల్లడించారు.

దత్తత తీసుకున్నారు.. తిరిగి చూడలేదు..

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతున్న క్రమంలో అడ్డుపడిన గ్రామస్తులు సింగరేణి తమ గ్రామాన్ని దత్తత తీసుకుని ఇంతవరకు ఇటువైపు కూడా తిరిగి చూడలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగం కోసం వెళ్తే తమను పట్టించుకోలేదని, స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా లేవని నిలదీశారు. బీటీపీఎస్ రైల్వే ట్రాక్ ద్వారా, బొగ్గు రవాణా లారీల వేగానికి ప్రమాదాల ద్వారా, నీరు కలుషితం ద్వారా ఇక్కడి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని వాపోయారు. మరోసారి తమ పొలాలు ఇచ్చి రోగాల బారిన పడలేమంటూ నిరసన తెలిపారు. అనంతరం జీఎం దుర్గం రామచందర్‌లు, పీఓ లక్ష్మీపతిగౌడ్ మాట్లాడుతూ సింగరేణి దత్తత తీసుకున్న రామానుజవరంలో సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా కల్పించిన సౌకర్యాలను, ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ల వివరాలు వెల్లడించారు. ప్రభావిత గ్రామాల్లో సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

డిమాండ్లపై సమాలోచన చేస్తాం : స్పెషల్ డిప్యూటీ కలెక్టర్



అధికారులను నిలదీస్తున్న గ్రామస్తుడు

సింగరేణి, రెవెన్యూ బృందంతో సాంకేతికత సహకారంతో గ్రామ నక్షా, జీపీఎస్‌ల ద్వారా రెవెన్యూ రికార్డులను అనుసరించి సర్వే నిర్వహిస్తారని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టి.సుమ వివరించారు. పీసా కమిటీ లేదని, గ్రామస్తులు ఒక కమిటీగా ఏర్పడిన అనంతరం డిమాండ్లపై సమాలోచన చేస్తామని హామీనిచ్చారు.కాగా సభ ఏర్పాటు చేసిన అంశం రికార్డు చేసే క్రమంలో గ్రామస్తుల సంతకాలు అవసరం కాగా, గ్రామస్తులు సంతకాలు పెట్టేది లేదంటూ వెనుదిరిగారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, డీటీ సునీతా ఎలిజబెత్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఎంపీటీసీ పాయం లక్ష్మయ్య, తిర్లాపురం పీసా సెక్రటరీ స్వప్న, సింగరేణి సిబ్బంది రాజు, సలగల రమేష్, షబ్బీరుద్దీన్‌తోపాటు ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బాడిశ సతీష్, గ్రామస్తులు ఆవుల సర్వేశ్వరరావు, జంపన సీతా రామరాజు, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ నిఘాలో అంగన్‌వాడీలు..

- బయోమెట్రిక్ పద్ధతిలో హాజరు నమోదు
- అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో పారదర్శకతకు చర్యలు

కొత్తగూడెంటౌన్: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో పని చేస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా సీసీ కెమెరాలను అమర్చి, బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేస్తామని శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీంతో అంగన్‌వాడీల్లో నిఘాతోపాటు పారదర్శకత కూడా పెరగనుంది. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 11 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,060 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 2,060 మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఆయా కేంద్రాల్లో పని చేస్తున్నారు. వీటి నుంచి 6 నెలల నుంచి 3 ఏళ్ల వరకు ఉన్న 34,117 మంది పిల్లలకు, 3 ఏళ్ల నుంచి 6 ఏళ్ల వయసు పిల్లలు 26,164 మందికి పాలు, గుడ్లు, బాలామృతం ప్యాక్‌లు అందిస్తున్నారు. బలవర్ధక ఆహారం అందించడంతోపాటు చిన్నారులకు అక్షరాలు సైతం నేర్పిస్తున్నారు. పోషకాహార లోపం ఉన్న పిల్లలపై తగిన శ్రద్ధ తీసుకుంటున్నారు. ఆరోగ్యం, వయసుకు తగిన ఎత్తు, బరువు ఉండేలా చూస్తున్నారు.

సమయపాలన పాటించేలా..

అంగన్‌వాడీ కేంద్రాలకు టీచర్లు, ఆయాలు సమయానికి విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. హాజరు నమోదుకు బయోమెట్రిక్ విధానం అమలు చేయనున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో అవకతవకలు జరగకుండా ఉంటాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటివరకు కొందరు టీచర్లు అంగన్‌వాడీ కేంద్రాలకు ఇష్టానుసారంగా వస్తున్నారని, విధి నిర్వహణలో సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ వ్యవస్థ ప్రవేశపెడితే సమయపాలన పాటించనివారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవచ్చు. కేంద్రాల నిర్వహణలో పారదర్శకత కూడా పెరగనుంది.

అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినంగా జరుపుకుందాం..

మావోయిస్టు పార్టీ నేత ఆజాద్



చర్ల మండలంలో మావోయిస్టులు ఏర్పాటు చేసిన బ్యానర్

చర్ల: ఈనెల 8న అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినాన్ని జరుపుకుంటూ, మహిళలపై జరుగుతున్న అమానవీయ దాడులు, రాజ్య హింసకు వ్యతిరేకంగా పోరాడాలని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం ఆయన ఒక లేఖ విడుదల చేశారు. మహిళలు పితృస్వామ్యం నుంచి విముక్తి కోసం కార్మికవర్గ విప్లవంలో సంఘటితం కావాల్సిన అవసరాన్ని అంతర్జాతీయ మహిళా దినోత్సవం గుర్తుచేస్తోందని తెలిపారు. మహిళలు పీడన, శ్రమ దోపిడీకి గురవుతున్నందున మహిళల విముక్తి కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

మావోల కరపత్రాలు, బ్యానర్లు

ఈనెల 8న అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినాన్ని జరుపుకోవడమే కాక మణిపూర్ మహిళలపై జరిగిన అమానవీయ దాడులు, రాజ్యహింసకు వ్యతిరేకంగా పోరాడదామంటూ మావోయిస్టు పార్టీ కరపత్రాలు, బ్యానర్లు విడుదల చేసింది. ఆదివాసీ విప్లవ మహిళా సంఘం, విప్లవ మహిళా సంఘాల పేరుతో చర్ల మండలంలోని పలుచోట్ల కరపత్రాలు, బ్యానర్లు ఏర్పాటుచేశారు. పెట్టుబడిదారీ విధానాలు, పితృస్వామిక భావజాలాన్ని పెంచి పోషిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలని అందులో పిలుపునిచ్చారు. కాగా, సమాచారం అందుకున్న పోలీసులు వీటిని తొలగించారు.

భద్రతతోనే సంస్థ అభివృద్ధి



భద్రతా పతాకాన్ని ఎగురవేస్తున్న సీఈ బిచ్చన్న

మణుగూరు రూరల్: భద్రతతో కూడిన ఉత్పత్తికి పాటుపడడం భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్(బీటీపీఎస్)ను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లవచ్చని సీఈ బి.బిచ్చన్న తెలిపారు. మణుగూరు మండలం చిక్కుడుగుంటలోని బీటీపీఎస్‌లో సోమవారం జాతీయ భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈ బిచ్చన్న భద్రతా పతకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతీ ఒక్కరు నిబద్ధతతో పనిచేస్తూ నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తికి కృషి చేయాలన్నారు. అలాగే, విధి నిర్వహణలో రక్షణ, భద్రత నియమాలను తప్పక పాటించాలని సూచించారు. అనంతరం ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్లు, కార్మిక సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రతా చర్యలు పాటించాలి



మాట్లాడుతున్న సీఈ ప్రభాకర్‌రావు

పాల్వంచ: కర్మాగారాల్లో భద్రతా చర్యలు పాటించాలని కేటీపీఎస్ 5,6 దశల సీఈ ఎం.ప్రభాకర్ రావు అన్నారు. కర్మాగారంలో సోమవారం ఆయన జాతీయ భద్రతా వారోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. రక్షణ చర్యలు పాటించడంలో అలసత్వం వహించొద్దని, అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయాలని చెప్పారు. జెన్‌కో విజిలెన్స్ ఎస్పీ డి.ప్రతాప్ మాట్లాడుతూ రక్షణపై అందరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఎస్ఈలు వి.వెంకటేశ్వర్లు, టి.సత్యనారాయణ, పి.కృష్ణ, ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఎ.అప్పాజీ, ఇన్‌స్పెక్టర్ రత్నారావు, సేఫ్టీ డీఈ ఎస్.సమ్మయ్య, ఏడీఈ ఎస్.నాగయ్య, శేసాయి, ఫైర్ ఆఫీసర్ వై.శ్రీనివాస్, వెల్ఫేర్ ఆఫీసర్ భాగం రాధాకృష్ణ పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్ల దొంగలు అరెస్ట్

భద్రాచలంఅర్బన్: మోటార్ సైకిళ్లను చోరీ చేస్తున్న ఇద్దరిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. భద్రాచలం సీఐ సంజీవరావు కథనం ప్రకారం.. పట్టణంలోని కూనవరం రోడ్‌లో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. బైక్‌పై అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా వారు మూడు బైక్‌లు చోరీ చేసినట్లు తేలింది. నిందితులు ములుగు జిల్లా మంగపేట మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన బొబ్బ సూర్యప్రకాష్, భద్రాచలం పట్టణంలోని సీతారామనగర్ కాలనీకి చెందిన చిప్పల సత్యనారాయణ రాజులుగా తెలిసింది. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్‌ఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ సూర్యం, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక స్వాధీనం

దుమ్ముగూడెం : మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను రెవెన్యూ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. సుమారు 30 ట్రక్కుల ఇసుకను అనుమతులు లేకుండా నిల్వ చేయడంతో సీజ్ చేసినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు.

ట్రాన్స్‌కో తీరుతో కుటుంబాల మధ్య ఘర్షణ

నిరసనగా సెల్‌టవర్ ఎక్కిన యువకుడు



సెల్ టవర్ ఎక్కి నిరసన తెలుపుతున్న యువకుడు

ఇల్లెందురూరల్: ఓ సెల్‌టవర్‌కు విద్యుత్ లైన్ అందించే క్రమంలో బస్తీలో అస్తవ్యస్తంగా ఉన్న తీగలను సరిచేసేందుకు ట్రాన్స్‌కో అధికారులు తీసుకున్న నిర్ణయం పలు కుటుంబాల మధ్య ఘర్షణకు దారితీసింది. మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ పరిధి ఓ వీధిలో సెల్ టవర్‌కు నూతనంగా 11 కేవీ విద్యుత్తు సరఫరా అందించేందుకు ట్రాన్స్‌కో అధికారులు నూతన లైన్ ఏర్పాటుకు నిర్ణయించారు. అయితే అప్పటికే ఆ వీధిలో గృహవినియోగం కోసం విద్యుత్ తీగలు ఇళ్ల మీదుగా ఏర్పాటు చేశారు. వాటిని తొలగించి 11కేవీ విద్యుత్ లైన్‌కు అనుసంధానం చేసే పనుల చేపట్టారు. ఇందుకోసం సెల్ కంపెనీ నుంచి రూ.6.50 లక్షల రుసుము తీసుకున్నారు. కొత్తలైన్ ఏర్పాటు పనులను ఆ వీధిలో ఒకటి, రెండు కుటుంబాలు అడ్డుకునే ప్రయత్నం చేశాయి. పాత ప్రదేశంలో వేయాల్సిన స్తంభాలను నూతనంగా తమ ఇంటి వద్ద ఎలా ఏర్పాటు చేస్తారని నిలదీశారు. ఇలా వివాదం కొన్ని రోజులుగా కొనసాగుతుండగానే సోమవారం విద్యుత్ తీగలతో సిబ్బంది అక్కడకు చేరుకోవడంతో పండు అనే యువకుడు సమీపంలోని సెల్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాన్స్‌కో ఏడీఈ కోటేశ్వరరావు సహాయంతో యువకుడికి నచ్చజెప్పి కిందకు దించారు. ఆ తర్వాత పోలీసుల సూచన మేరకు వీధిలోని ప్రజలకు అభ్యంతరం లేకుండా 11కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో నిర్ణయించడంతో స్థానికులు శాంతించారు.

ఏమార్చి.. రూ.40 వేలు అపహరణ

దమ్మపేట: బ్యాంకు నుంచి నగదుతో వస్తున్న ఓ రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగిని, బురిడీ కొట్టించి, నగదును దొంగిలించిన సంఘటన మండల కేంద్రంలో సోమవారం జరిగింది. బాధితుల కథనం ప్రకారం... దమ్మపేట గ్రామంలో నివాసముంటున్న రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి నృసింహాద్రి అంజయ్య (65) సోమవారం స్థానిక ఎస్‌బీఐ నుంచి రూ.40,000 విత్‌డ్రా చేసుకుని సైకిల్‌పై ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో దమ్మపేట గ్రామంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం పక్కనే గల తన ఇంటి వద్దకు చేరుకోగా, రోడ్డు మీద గుర్తు తెలియని వ్యక్తి బైక్ తన మీద పడిపోయినట్లుగా నటించి, పైకి లేపాలని కోరాడు. దీంతో అంజయ్య నగదు బ్యాగు సైకిల్‌కి తగిలించి, అతడిని లేపటానికి ప్రయత్నించాడు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన మరో వ్యక్తి సైకిల్‌కు తగిలించిన నగదు బ్యాగును తీసుకుని ఉడాయించాడు. ఈ విషయం గమనించకుండా, బైక్‌పై ఉన్న వ్యక్తి బాధితుడిని మాటల్లో పెట్టాడు. అతడు కొంత దూరం ముందుకు వెళ్లిన తర్వాత బైక్‌పై ఎక్కి వెళ్లిపోగా, తన నగదు బ్యాగు దొంగిలించినట్లు అంజయ్య గుర్తించాడు. ఇదే రీతిలో మండల కేంద్రంలో రెండు మొబైల్‌ఫోన్లు కూడా చోరీ చేసినట్లు సమాచారం.

తల్లికి తల కొరివి పెట్టిన తనయ

నెలరోజుల వ్యవధిలోనే దంపతులు మృతి



అంత్యక్రియలు పూర్తిచేస్తున్న కూతురు శ్వేత

సుజాతనగర్: కొడుకులు లేని ఆ తల్లికి కూతురే అన్నీ తానై తలకొరివి పెట్టింది. ఈ సంఘటన మండల పరిధిలోని వేపలగడ్డ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు రాయ లక్ష్మారెడ్డి గత నెల 7న అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన భార్య లక్ష్మి గుండెపోటుతో ఆదివారం మృతి చెందింది. నెల రోజుల వ్యవధిలోనే దంపతులు మృతి చెందడంతో గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. లక్ష్మి దహన సంస్కారాలను సోమవారం నిర్వహించగా, దంపతులకు కొడుకులు లేకపోవడంతో చిన్న కుమార్తె శ్వేత కర్మకాండలు పూర్తిచేసింది. శ్వేత స్థానిక ధన్వంతరి కళాశాలలో బీ ఫార్మసీ తృతీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం సెమిస్టర్ పరీక్ష ఉండగా, పరీక్షకు వెళ్లకుండా తల్లికి అంత్యక్రియలు నిర్వహించి రుణం తీర్చుకుంది.

ఇద్దరికి రెండు రోజుల జైలుశిక్ష

ఇల్లెందు: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులకు రెండు రోజుల జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ సోమవారం ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి డి.కీర్తిచంద్రికరెడ్డి తీర్పు వెలువరించారు. రాఘబోయినగూడేనికి చెందిన ఈసం నాగార్జున, ఎర్రబోడు మాణిక్యారానికి చెందిన గుగులోతు రామ్‌లు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడగా, న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారని సీఐ కరుణాకర్ తెలిపారు.

హత్య కేసులో ఇద్దరికి జీవితఖైదు

కొత్తగూడెంటౌన్: మహిళను హత్య చేసిన కేసులో ఇద్దరు వ్యక్తులకు జీవితఖైదు విధిస్తూ సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ తీర్పు చెప్పారు. తీర్పు వివరాలు ఇలా ఉన్నాయి. కామేపల్లి మండలం పొన్నెకల్లుకు చెందిన అనితకు అదే మండలం లింగయ్య తండాకు చెందిన బానోత్ నాగేశ్వరరావు అలియాస్ నగేష్‌తో వివాహేతర సంబంధం ఉంది. ఈ నేపథ్యంలో పలుమార్లు గొడవలు జరగ్గా అనిత తన భర్తకు విడాకులు ఇచ్చింది. కొంతకాలం తర్వాత నాగేశ్వరరావును కూడా దూరం పెట్టగా, అతను అనుమానంతో పంచాయితీ పెట్టించాడు. నాగేశ్వరరావుకు పెద్దమనుషులు రూ. 10 వేలు జరిమానా వేయగా, అనిత చెప్పుతో కొట్టింది. అవమానాన్ని మనసులో పెట్టుకుని ఆమెను కడతేర్చాలని నాగేశ్వరరావు పథకరచన చేశాడు. ఇందుకోసం కారేపల్లి మండలం దుబ్బా తండాకు చెందిన బానోతు నరేష్, వాంకుడోతు సంకి, చీమలపాడుకు చెందిన పేరం లక్ష్మయ్యలకు రూ.50 వేలకు సుపారి ఇచ్చాడు. తొలుత రూ. 10 వేలు చెల్లించాడు. ముందస్తు పథకం ప్రకారం 18.11.2017న నాగేశ్వరరావు అనితను తీసుకుని భద్రాచలం వెళ్లాడు. తాము భార్యాభర్తలమంటూ శ్రీకృష్ణ దేవాలయ సత్రంలో గది తీసుకున్నారు. అదే రోజు సుపారి తీసుకున్న ముగ్గురు వ్యక్తులు కూడా సత్రంలో వారి పక్క గది తీసుకున్నారు. మరుసటి తెల్లవారుజామున అందరూ వెళ్లిపోయారు. రూం క్లీన్ చేసేందుకు పనిమనిషి వెళ్లగా అనిత బాత్రూంలో రక్తపు మడుగులో విగతజీవిగా కనిపించింది. సత్రం లీజు యజమాని స్వరాజు రామకృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నాగేశ్వరరావు, సంకి, పేరం లక్ష్మయ్య, బానోత్ నరేష్‌లు అనితకు మద్యం తాగించి, కత్తితో పొడిచి హతమార్చినట్లు, ఆమె ఆభరణాలు దొంగిలించినట్లు విచారణలో తేలింది. అనంతరం నాగేశ్వరావు తల్లి బోడ ద్వాలి, భార్య లక్ష్మి సహా ఆరుగురిపై పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. పదహారు మంది సాక్షులను విచారించిన న్యాయమూర్తి నాగేశ్వరరావు అలియాస్ నగేష్, బానోతు నరేష్‌పై నేరం రుజువు కాగా జీవితఖైదు విధించడంతోపాటు చెరో రూ. 3 వేలు జరిమానా విధించారు. కాగా విచారణ సమయంలో బోడ ద్వాలి మృతి చెందింది. మిగతా వారిపై కేసును కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. పీపీ పొసాని రాధాకృష్ణ మూర్తి వాదనలు వినిపించగా, సిబ్బంది ఎస్.వీరబాబు, సుధీర్ సహకరించారు.

అంత్యక్రియలు మేం చేస్తాం.. కాదు మేమే..

అంతిమ సంస్కారం కోసం కొడుకు, కూతురు కుటుంబాల జగడం



పోలీసుల సమక్షంలో చర్చిస్తున్న ఇరు కుటుంబాలు

ఇల్లెందురూరల్: ఎనిమిది పదుల వయసు దాటిన వృద్ధురాలు అనారోగ్యంతో తుదిశ్వాస విడిచింది. అయితే, ఇన్నాళ్లూ సేవలందించిన తామే అంత్యక్రియలు నిర్వహిస్తామని కుమార్తె కుటుంబీకులు... కాదు సంప్రదాయం ప్రకారం తామే జరిపిస్తామని కొడుకు కుటుంబాలు ఆందోళనకు దిగాయి. ఎంతచెప్పినా కుమార్తె కుటుంబీకులు పట్టువీడకపోవడంతో ఆస్తి కోసం గొడవకు రావొద్దని చెబుతూ అంత్యక్రియలు పూర్తికాకుండానే కొడుకు కుటుంబం వెళ్లిపోవడం గమనార్హం. వివరాలిలా.. గోదావరిఖని ప్రాంతానికి చెందిన బిల్ల నర్సమ్మకు కుమారుడు ప్రతాపరెడ్డి, కుమార్తె మహేంద్ర ఉన్నారు. కుమారుడు ప్రతాపరెడ్డి ఐదేళ్ల క్రితం మృతి చెందగా కొన్నాళ్లు ఆయన ఇంటి వద్దే ఉన్న నర్సమ్మ ఆ తర్వాత ఇల్లెందు మండలం విజయలక్ష్మినగర్‌లో ఉంటున్న కుమార్తె మహేంద్ర ఇంటికి చేరుకుంది. నాలుగేళ్లుగా ఆమె ఆలనపాలన కుమార్తె చూస్తుండగా, నర్సమ్మ ఆదివారం రాత్రి మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న నర్సమ్మ కోడలు, కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం చేరుకుని మృతదేహాన్ని గోదావరిఖని తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహిస్తామని కుమార్తె మహేంద్రను కోరగా ఆమె నాలుగేళ్ల పోషించినందున తామే అంత్యక్రియలు చేస్తామని స్పష్టం చేసింది. ఈ విషయంలో ఇరు కుటుంబాలు ఘర్షణకు దిగగా, ఆస్తి విషయమై వాదనలు సాగాయి. చివరకు నర్సమ్మ కుమారుడి కుటుంబీకులు పోలీసులను ఆశ్రయిస్తే అంత్యక్రియలు చేసే హక్కు కుమారుడి కుటుంబ సభ్యులకే ఉంటుందని పోలీసులు నచ్చచెప్పే ప్రయత్నం చేసినా కూతురు కుటుంబీకులు ససేమిరా అన్నారు. దీంతో ఆస్తి విషయంలో కలుగచేసుకోవద్దంటూ కుమారుడి తరఫువారు అక్కడి నుంచి వెళ్లిపోవడంతో మహేంద్ర తల్లికి అంత్యక్రియలు పూర్తిచేసింది.